క్లుప్తంగా

పల్లంట్ల హైస్కూల్ ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా గంగారత్నం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల జెడ్పీ హైస్కూల్ యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా కొమారపు గంగారత్నం ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ధీటుగా ఎన్నికలు జరిగాయి. కమిటీ చైర్‌పర్సన్‌గా గంగారత్నం, వైస్ చైర్మన్‌గా కడిమి మహేష్, సభ్యులుగా పాల రాఘవులు, నరమామిడి వరలక్ష్మి, గెడ్డం వెంకటేష, సానబోయిన లక్ష్మీపద్మావతి, నరమామిడి అలివేలు, జక్కుల వీరాస్వామి, తొర్లపాటి తులసి ఎన్నికైనట్టు వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు శుక్రవారం కూచిపూడి సతీష్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కూచిపూడి సతీష్, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు రాయుడు వెంకట్రావు తదితరులు అభినందించారు.

ట్రీ కటింగ్ పనుల పరిశీలన



చీపురుగూడెం వద్ద ట్రీ కటింగ్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్‌రాజు

నల్లజర్ల: స్థానిక సబ్ స్టేషన్ నుంచి పోతినీడుపాలెం 132 కేవీ విద్యుత్ లైన్‌పై అల్లుకున్న చెట్ల కొమ్మలను ట్రాన్స్‌కో కత్తిరిస్తున్నారు. ఈ ప్రక్రియను విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు శుక్రవారం పరిశీలించారు. ఫీడర్లకు అంతరాయం లేకుండా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. నల్లజర్ల, చీపురుగూడెం సబ్ స్టేషన్ల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట డీఈ వీరభద్రరావు, ఏడీఏ జే. రాము, ఏఈ బాపిరాజు ఎల్ఐలు ఈదా డేవిడ్, రాజు తదితరులు ఉన్నారు.

ఆదివాసీ వేషధారణలో అంగన్‌వాడీ చిన్నారులు



ఆదివాసీ బాలల వేషధారణలో మలకపల్లి అంగన్‌వాడీ కేంద్ర చిన్నారులు

తాళ్లపూడి: దివాసీ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని మలకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో ఆదివాసీల వేషధారణలు వేయించారు. వారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులతో పాటు, అంగన్‌వాడీ వర్కర్ ఆర్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



వేగేశ్వరపురంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంఈవోలు

తాళ్లపూడి: విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరు జాతీయ జెండాను గౌరవించాలని ఎంపీడీవో టీబీ వెంకటరమణ అన్నారు. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్ సూర్జాన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి 'పశ్చిమ' జెడ్పీటీసీల సంఘ కోశాధికారిగా 'కొయ్యే'



నిడదవోలు జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు

నిడదవోలు రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీటీసీ సభ్యుల సంఘ నూతన కోశాధికారిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు శుక్రవారం వెల్లడించారు. ఇప్పటికే జెడ్పీఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా సూరిబాబు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సూరిబాబును మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, ప్రభుత్వ మాజీ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, ఆ పార్టీ నాయకులు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సూరిబాబును అభినందించారు.

ఇసుక తరలించి లీజు చెల్లించరా?

- అధికారులను నిలదీసిన ముగ్గురు లీజుదారులు
- ఉసులుమర్రు స్టాక్ పాయింట్ నుంచి దాదాపు ఇసుక తరలింపు
- స్థల యజమానులకు 14 నెలల లీజు బకాయి
- ఏడాదికి రూ.3.70 చెల్లించేలా నాలుగేళ్ల క్రితం అగ్రిమెంట్



ఉసులుమర్రు ఇసుక నిల్వల వద్ద భూమి లీజుదారులతో చర్చిస్తున్న ఎస్సై, తహసీల్దార్

పెరవలి: ఇసుక నిల్వ చేసేందుకు అధికారులు స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. లీజు సొమ్ము అడుగుతుంటే రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇసుక అమ్మకాలను అడ్డుకుంటే కుదరదు అంటున్నారు. లీజు సొమ్ము ఇవ్వకుండా ఇసుకను తీసువెళ్లిపోతే తమకు ఎవరు సమాధానం చెబుతారు? లీజు సొమ్ము తమకు ఇప్పించండి, లేదంటే అప్పటి వరకూ ఇసుక అమ్మకాలను నిలుపుదల చేయండి అంటూ భూమి లీజుదారుల వేడుకున్నారు. ముగ్గురు లీజుదారులు శుక్రవారం ఉసులుమర్రులోని ఇసుక స్టాక్ పాయింట్ చేరుకుని తమ లీజు సొమ్ము ఎప్పుడు చెల్లిస్తారని అధికారులను నిలదీశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉసులుమర్రులో ఇసుక నిల్వల కోసం నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వీరమళ్ల సత్యనారాయణ, రామగుడుల సూర్యనారాయణ, వీరమళ్ల ఉషారాణిలకు చెందిన మూడెకరాల భూమిని ఏడాదికి రూ.3.70 లక్షల చొప్పున లీజు చెల్లించేలా అప్పటి జేపీ కంపెనీ లీజ్ అగ్రిమెంట్ చేసుకుంది. ఆ ప్రకారం ఏటా లీజు సొమ్ము చెల్లిస్తున్నారు. ఏడాది క్రితం ప్రతిమా కంపెనీ ఇసుక కాంట్రాక్ట్ తీసుకుంది. ఆ కంపెనీ అధికారులను ముగ్గురు రైతులూ తమకు లీజు చెల్లించమని అడిగారు. కోటి రూపాయిల ఇసుక మీ స్థలంలో ఉంది దానిని తీసుకెళ్లినపుడు లీజు సొమ్ము చెల్లిస్తామని అధికారులు తమకు చెప్పారని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం మారడంతో ఇసుక నిల్వలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తమకు బకాయిపడిన 14 నెలల లీజు చెల్లించాలని గత నెల 27న మైనింగ్ డీడీని లిఖిత పూర్వకంగా కోరామని, అయితే ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ముగ్గురు రైతులు వివరించారు. ఇప్పుడు ఇసుకంతా అమ్మేసుకున్నారని ప్రస్తుతం ఉన్న ఇసుక కేవలం మూడు రోజులకు మించి ఉండదని ఈరోజు లీజు సొమ్ములు అయినా ఇవ్వాలి లేకపోతే ఇసుక తరలింపు అయినా నిలుపుదల చేయాలని కోరితే కుదరదని అధికారులు హెచ్చరిస్తున్నారని వాపోయారు. ఇసుక అమ్మకాలకు తాము అడ్డుపడితే తహసీల్దార్ కనకదుర్గ, ఎస్సై అప్పారావు సిబ్బందితో వచ్చి ఇసుక అమ్మకాలు నిలుపుదల చేయడం కుదరదని స్పష్టం చేశారన్నారు. లీజు సొమ్ము అందేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తమకు చెప్పారన్నారు. శనివారం తమకు సొమ్ములు ఇవ్వకపోతే ఇసుక విక్రయాలు జరగకుండా అడ్డుకుంటామని, అరెస్టు చేసినా పర్వాలేదని ముగ్గురు రైతులు తేల్చిచెప్పారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద చర్య దుర్మార్గం

- దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- చాగల్లులో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్



చాగల్లు అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న తలారి వెంకట్రావు.చిత్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు

చాగల్లు: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులోని రేడియో రూమ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన పాలభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద గల శిలాఫలకాన్ని దౌర్జన్యంగా ధ్వంసం చేయడం దారుణమన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద గల శిలాఫలకంపై వైఎస్ జగన్ పేరుని తొలగించవచ్చేమో కానీ ప్రజల గుండెల్లో ఆయన పేరును తొలగించలేరన్నారు. భావితరాలకు దిక్సూచిగా ఉండాలనే ఉద్దేశంతో విజయవాడ రూ.425 కోట్లు వెచ్చించి అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఈ విగ్రహం వద్ద దౌర్జన్యం చేయడం దుర్మార్గమైన చర్య అని తలారి ఖండించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన జరుగుతుందన్నారు.

కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి

విగ్రహం వద్ద దాడి జరుగుతున్నపుడు సమీపంలోనే అధికారులు, పోలీసులు ఉన్నా ఎందుకు పట్టించుకోలేదు?అని తలారి వెంకట్రావు ప్రశ్నించారు. ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను ఖండిస్తూ సీఎం చంద్రబాబు కనీసం మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదంటే ఈ ఘటనతో ఆయనకు సంబంధం ఉండే ఉంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, సర్పంచ్‌లు మట్టా వెంకట్రావు, ముప్పిడి మహాలక్ష్ముడు, ఎంపీటీసీ సానబోయిన అర్జునుడు, జాలెం వెంకట్రావు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో 14న మెగాలోక్ అదాలత్

కొవ్వూరు: సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసు అధికారులు తమవంతు తోడ్పాటు అందించాలని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ సూచించారు. పట్టణంలోని కోర్టు హాల్లో శుక్రవారం మధ్యాహ్నం పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏయే స్టేషన్‌లో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని రాజీ మార్గంలో పరిష్కరించవచ్చు? గుర్తించారని పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఎక్కువ మంది కక్షిదారులు వినియోగించుకునేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.గోపాలపురం, కొవ్వూరు, దేవరపల్లి, తాళ్లపూడి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ గుడిలో శ్రావణ శుక్రవారం పూజలు



కోటసత్తెమ్మ అమ్మవారు



తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మీదేవి

నిడదవోలు రూరల్: శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. తణుకు వాస్తవ్యులు ఎస్.వెంకటగిరి శ్రీనివాసరావు, జ్యోత్స్న దంపతుల ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, ఆలయ ప్రాంగణంలో చండీహోమాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్,ప్రధానార్చకుడు అప్పారావు శర్మలు పాల్గొన్నారు. మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం, సమిశ్రగూడెం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ

నిడదవోలు: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి ఆలయంలో కొనిజేటి నాగమణి ఆధ్వర్యంలో మహిళలు సహస్ర దీపాలంకరణ చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకుటుకోంది. కార్యక్రమంలో కాకర్ల సూరిబాబు, అర్చకులు దుర్గాప్రసాదాచార్యులు, ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: శ్రావణ మాసంలో వరలక్ష్మీదేవిని పూజిస్తే సౌభాగ్యంతో పాటు, ఆయురారోగ్యాలు కూడా కలుగుతాయని అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి అన్నారు. శ్రావణ మాసంలోని తొలి శుక్రవారం కావడంతో స్థానిక రాజ్యలక్ష్మి దేవాలయంలో అధిక సంఖ్యలో మహిళలు ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. అమ్మవారిని చామంతి, గులాబీలు, కనకాంబరం పూలతో అలంకరించారు. అలాగే తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు చేశారు.

చాగల్లు: శ్రావణ శుక్రవారం కావడంతో మండలంలోని అమ్మవారి ఆలయాలు మహిళలతో కిక్కిరిశాయి. చాగల్లు వల్లికుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, ధనలక్ష్మమ్మ ఆలయంలోను, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు విశేష పూజలు చేశారు. లలితా సహస్రనామాలు, విష్ణు సహస్ర నామాలు, భగవద్గీత పారాయణ, శివ సహస్రనామాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలోను భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు, పూజలు నిర్వహించారు. నోములు నోచుకుని ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చారు.



నిడదవోలులో దీపాలంకరణ



కోట సత్తెమ్మకు లక్ష కుంకుమార్చన

డీఎస్పీగా దేవకుమార్ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీగా దేవకుమార్



పట్టణ సీఐగా విశ్వం

కొవ్వూరు: సబ్ డివిజినల్ పోలీసు అధికారి (డీఎస్పీ)గా జి.దేవకుమార్ శుక్రవారం కొవ్వూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో స్నేహభావంతో మెలగుతూ, వారికి మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గంజాయి అక్రమ రవాణా, వాడకం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.1991 బ్యాచ్‌కు చెందిన తాను గతంలో అమలాపురం, ఉప్పలగుప్తం, వై.రామవరం, రాజమహేంద్రవరం టూ టౌన్, కాకినాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా పని చేశారు. తాడేపల్లి, అమలాపురం రూరల్ సీఐగా పని చేసి పదోన్నతిపై సీఐడీకి వెళ్లారు. విజయవాడ సీఐడీ విభాగం నుంచి బదిలీపై కొవ్వూరు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఉన్నతాధికారులను కలిశారు. రూరల్ సీఐ కె.విజయబాబు, ఎస్సైలు కె.శ్రీహరిరావు, రామకృష్ణ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ సీఐగా విశ్వం

పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.విశ్వం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన వి. జగదీశ్వరరావు ఆకివీడు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న విశ్వం బదిలీపై కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చారు.ఈ సందర్భంగా విశ్వం విలేకర్లతో మాట్లాడుతూ మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. మహిళలను ఇబ్బందులు పెట్టడం, అనుచితంగా ప్రవర్తించడం క్షమించమన్నారు. నేరాలు, గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి పూట గస్తీని పటిష్టం చేస్తామన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు.

మాదకద్రవ్యాలు తీసుకుంటే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ

నిడదవోలు: మాదకద్రవ్యాలు విక్రయించిన వారిపైనే కాకుండా వాటిని తీసుకున్నవారిపై కూడా కఠిన చర్యలు తప్పవని నిడదవోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ అన్నారు. ఆంధ్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి రామకృష్ణ మాట్లాడుతూ మాధక ద్రవ్యాల వల్ల ఏర్పడే నష్టాలు, వాటిని తీసుకుంటే కలిగే అనర్థాలను వివరించారు. అలాగే జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయరాని వాటివల్ల మిగతా వారు ఇబ్బందికి గురవుతారన్నారు. ర్యాంగింగ్ చేయడం కూడా నేరమేనని అలా చేస్తే విద్యార్థులు శిక్షకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రవికుమార్, ప్రధాన కార్యదర్శి జి. రవికుమార్, ఉపాధ్యక్షుడు ఏఏఎస్ విశ్వనాథ్, కార్యదర్శి ఎ.సతీష్ కుమార్, లోక్ అదాలత్ సభ్యులు ఎన్. సుబ్బారావు, ఎం. వేంకటేశ్వరరావు, న్యాయవాదులు సీహెచ్ విజయకుమార్, ఎండీ మెహబూబ్, ఎంవీకే రాజేశ్వరరావు, యుఎంఎల్ ప్రసన్న, కె.జమీల, పాలా వెంకటలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



పోతవరం పీహెచ్‌సీకి వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులు

నల్లజర్ల: గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని డాక్టర్ వేదమణి, డాక్టరు వెంకట్రావు సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోతవరం పీహెచ్‌సీలో శుక్రవారం కొయ్యలగూడెం సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ డాక్టర్ వెంకట్రావు, సురక్ష ఆసుపత్రి డాక్టరు వేదమణి 58 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదమణి మాట్లాడుతూ గర్భిణులు మానసిక వత్తిడికి గురవకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మాతాశిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరీక్షలు చేసిన గర్భిణులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యం, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



పెరవలి తహసీల్దార్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉండ్రాజవరం: స్థానిక తహసీల్దార్‌గా పీఎన్‌డీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లడంతో పెనమలూరు తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

పెరవలి తహసీల్దార్‌గా అచ్యుతకుమారి



బాధ్యతలు స్వీకరించిన అచ్యుతకుమారికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పెరవలి: స్థానిక తహసీల్దార్‌గా డి.అచ్యుతకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఎన్నికల సమయంలో ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్ట్ ముంపు మండలమైన కుక్కునూరులో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. బదిలీల్లో భాగంగా మండలానికి తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ పుష్పగుచ్ఛం అందించి అచ్యుతకుమారికి స్వాగతం పలికారు. అనంతరం వీఆర్ఓలు, వీఆర్ఏలు, సర్వేయర్లు నూతన తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

నిడదవోలు తహసీల్దార్‌గా నాయక్



నిడదవోలు: స్థానిక తహసీల్దార్‌గా బి. నాగరాజు నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కృష్ణా జిల్లా నందివాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు వి. నాగభూషణం కృష్ణా జిల్లా బావులపాడుకు బదిలీపై వెళ్లారు.

పొగాకు భూముల్లో పచ్చిరొట్ట వేయాలి

బోర్డు ఆర్ఎం ప్రసాద్



జీఎల్‌కే ప్రసాద్, ఆర్ఎం, పొగాకు బోర్డు

దేవరపల్లి: పొగాకు పండించే భూముల్లో పచ్చిరొట్ట పంటలు వేసి భూముల సారాన్ని పెంచాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పంటలు పెంచి పూత దశలో భూమిలో కలియదున్నాలని ఆయన రైతులకు సూచించారు. ప్రతి రైతుకూ పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ఉందని, పొలం గట్లు, బ్యారన్ల వద్ద మొక్కలు నాటాలన్నారు. పొగాకు అమ్మకాలు వేగంగా జరుగుతున్నాయని, ఎస్ఎల్ఎస్‌లో ఇప్పటి వరకూ సుమారు 49 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయన్నారు. బ్రైట్ గ్రేడు పొగాకు కొనుగోళ్లు దాదాపు పూర్తవుతున్నాయని, లోగ్రేడు పొగాకు కొనుగోలు చేయవలసి ఉందన్నారు. రైతులు నియంత్రణకు కట్టుబడి పంట వేయాలని, బోర్డు ఇచ్చిన కోటా మేరకు పంట సాగు చేసి నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. 2024-25 పంట కాలానికి పొగాకు బోర్డు 58.25 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చిందని, దీనికి లోబడి పంట సాగు చేయాలని ఆయన సూచించారు. బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల ఉత్పత్తి చేయడానికి బోర్డు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే అదనపు పొగాకు అమ్మకాలపై అపరాధ సుంకం రద్దు వర్తిస్తుందని, బోర్డు అనుమతి లేకుండా పండించిన రైతులకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. రిజిష్టర్ గ్రోయర్ పండించిన అదనపు పొగాకును వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఆయన సూచించారు.

జగన్నాథపురంలో 17న ఎస్ఎంసీ ఎన్నిక

నల్లజర్ల: మండలంలోని జగన్నాథపురం ఆర్‌సీఎం స్కూల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నిక జరిగింది. సభ్యుల ప్రమాణ స్వీకారం తర్వాత నరెడ్ల సుమను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. తతంగం పూర్తయ్యాక టీడీపీ నేతలు వచ్చి 'ఈఎన్నిక చెల్లదు. మేం ఇచ్చిన పేర్లనే స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ప్రకటించాలం' టూ హుకుం జారీ చేశారు. దీనికి అధికారులు తల ఊపుతూ కోరం లేని కారణంగా ఈ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించారు. స్కూల్లో 92 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కనీసం 50 మందికి పైగా తల్లిదండ్రులు హాజరు కావాల్సి ఉందని ఎంఈఓ వై.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇక్కడ ఈ నెల 17న మళ్లీ తల్లిదండ్రులకు నోటీసులు పంపి ఎన్నిక జరుపుతామని ప్రకటించారు. కాగా తూర్పుచోడవరం స్పెషల్ స్కూల్లో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఈ పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ లిఖిత పూర్వక లేఖ అందజేసినట్టు ఎంఈఓ తెలిపారు. 56 పాఠశాలలకు గాను 55 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సక్రమంగానే జరిగాయని ఆయన వివరణ ఇచ్చారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు 12 నుంచి శిక్షణ

నిడదవోలు రూరల్: గ్రామాల అభివృద్ధికి 100 రోజుల ప్రణాళికల్లో భాగంగా ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ మండల పరిధిలోని పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ శుక్రవారం తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామాల్లో పారిశుధ్యం, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని ఆమె చెప్పారు.

జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ్ కుమారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని పుస్తక పఠనం చేయాలని, పుస్తకం లేని గది ఆత్మ లేని శరీరం వంటిదన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.